

"ఎన్డీఏ కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలిపిస్తే ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తా. అధికారంలోకి వచ్చిన ఏడాదికే రాయలసీమకు గోదావరి, కృష్ణా జలాలను తీసుకువచ్చే బాధ్యత నాది. చెరువులు, కుంటలను నింపుతాం. ఈ జిల్లాకు నీరు జీవనధారం. నీరు ఉంటే పెట్టుబడులు వస్తాయి. రైతులు రూ.కోట్ల విలువైన పంటలను పండిస్తారు. రైతాంగానికి పెద్ద పీట వేస్తా. అన్ని విధాలుగా ఆదుకుంటా.."

"సీఎం జగన్ రాష్ట్రానికి సైకో. ఇక్కడా పిల్ల సైకో తయారయ్యాడు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దోపిడీలో తోపుగా మారాడు. టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ తీసుకొస్తే.. తోపు రూ.15 కోట్లు కమీషన్ డిమాండ్ చేశాడు. జాకీని తెలంగాణకు పారిపోయేలా చేశాడు. రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటై ఉంటే వందల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించేవి.."

- చంద్రబాబు



రాప్తాడు ప్రజాగళం..

బుక్కరాయసముద్రంలో..



సమయం లేదు మిత్రమా..!



బాగా ఆలోచించి.. ఓటు వేయండి

- ఉమ్మడి జిల్లాను హార్టికల్చర్ హబ్ చేస్తా
- రద్దయిన సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తా
- గోదావరి, కృష్ణా జలాలను సీమకు తీసుకొస్తా
- ఇసుక టిప్పర్ డ్రైవర్‌ను గెలిపిస్తే మళ్లీ దోచుకుంటారు
- రాప్తాడు ఎమ్మెల్యే పిల్ల సైకో.. జాకీ పరిశ్రమను తరిమేశాడు

ప్రజాగళం సభల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు

సూర్యుడు నడి నెత్తిమీదకు వచ్చాడు. ఎండ తీవ్రత ఏకంగా 41.5 డిగ్రీలు. ఇది చాలదన్నట్లు మిట్ట మధ్యాహ్నం నారా 'చంద్రుడు' నిప్పులు చెరిగాడు. అయినా జనం ఇళ్లలో దూరుకోలేదు. రోడ్డుమీదకు వచ్చారు. వాడి మాటల వేడికి చైతన్యం పొందారు. అవినీతితో తలపడుతున్న అభివృద్ధికి అండగా నిలుస్తామని ఈలలు, కేకలతో మద్దతు తెలిపారు. 'ఇంత ఎండలో మీటింగ్ పెట్టేందుకు ఎవరూ సాహసించరు. ఎన్నికలకు సమయం లేదు మిత్రమా..' అంటూ.. బాలయ్య డైలాగ్‌తో తన ఉద్దేశాన్ని స్పష్టం చేసిన టీడీపీ అధినేతకు జనం నుంచి అపూర్వ మద్దతు లభించింది. 'ప్రజాగళం' పర్యటనలో భాగంగా ఉమ్మడి జిల్లాలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం పర్యటించారు. మొదట రాప్తాడులో, ఆ తరువాత శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రంలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధిని వివరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలను ఎండగట్టారు. రెండు సభలకూ జనం పోటెత్తారు. కనుచూపుమేర వరకూ జనసందోహం కనిపించింది. మిద్దెలు, స్తంభాలను ఎక్కి యువత ఉత్సాహాన్ని ప్రదర్శించింది. దారి పొడవునా చంద్రబాబును చూసేందుకు జనం ఎగబడ్డారు. బాబు పర్యటన పార్టీ శ్రేణుల్లో పోరాట స్ఫూర్తిని నింపింది.

వివరాలు 7లో, మెయిన్‌లో...



"రిజర్వాయర్లు నిర్మించి, పిల్ల కాలువల ద్వారా లక్ష ఎకరాలకు నీరిస్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి జగన్ సమక్షంలో రైతులకు హామీ ఇచ్చారు. హామీ నెరవేర్చకపోతే మీసం తీయిచుకుంటా అన్నారు. రిజర్వాయర్ల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదు. రైతులకు ప్రకాష్‌రెడ్డి సమాధానం చెప్పాలి.."



- పరిటాల సునీత, టీడీపీ రాప్తాడు అభ్యర్థి

"ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అవినీతికి పాల్పడినందుకే ఆమెకు టిక్కెట్ నిరాకరించారని వైసీపీ నాయకులే అంటున్నారు. మళ్లీ దోచుకునేందుకు వారి ఇసుక దందాలో భాగసామ్యం అయిన టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇప్పించుకున్నారు. బినామీ అయితే నియోజకవర్గంలో మరింత దోచుకోవచ్చుని పథకం వేశారు. మీకు అవినీతి ఎమ్మెల్యే కావాలా..? నిరంతరం సేవ చేసే నాయకురాలు కావాలా..?"



- బండారు శ్రావణి శ్రీ, టీడీపీ శింగనమల అభ్యర్థి



కదిరిలో...

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్స్: డీఆర్వో



అనంతపురం టౌన్, మార్చి 28: ఎన్నికల సమయంలో అత్యవర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని డీఆర్వో రామక్రిష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించే విధానంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో అత్యవర సేవలు అందించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని తెలిపారు. నోటిఫై చేసిన శాఖల హెచ్‌ఓడీలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శాఖకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. మెట్రో, రైల్వే, పోలింగ్ సిబ్బంది, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలీగ్రామ్, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, మిల్క్ యూనియన్స్, సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్, షిప్పింగ్, జైళ్ల శాఖ, ఎక్సైజ్, వాటర్, ట్రెజరీ, అటవీ, సమాచారశాఖ, పోలీసు, పౌర రక్షణ హోంగార్డులు, ఆహార పౌర సరఫరాలు, శక్తి ఎయిర్ పోర్ట్, ప్రెస్, నేషనల్ ఇన్ఫర్మేషన్, విపత్తులనిర్వహణ తదితర శాఖలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వండి: కలెక్టర్



అనంతపురం టౌన్, మార్చి 28: జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తాగునీటిపై గురువారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 31 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించామని, భూగర్భ జలాలు అడుగంటినందున వచ్చే రెండు మూడు మాసాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉన్న నీటిని చాలా జాగ్రత్తగా వాడుకోవాలని అన్నారు. తాగునీటి పథకాలకు ఎలాంటి మరమ్మతులైనా వెంటనే చేయించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటర్లు.. 20 లక్షలు

మహిళా ఓటర్లు 21,823 మంది అధికం



అనంతపురం టౌన్, మార్చి 28: జిల్లా ఓటర్ల సంఖ్య 20 లక్షలు దాటింది. కలెక్టరు గౌతమి గురువారం విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 20,01,200 మంది ఓటర్లు ఉన్నారు. గత జాబితాతో పోలిస్తే 6,656 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో పురుష ఓటర్లు 9,89,568 మంది, మహిళా ఓటర్లు 10,11,391 మంది ఉన్నారు. ట్రాన్స్ జెండర్లు 241 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు 21,823 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ మహిళా ఓటర్లే ఎక్కువమంది ఉండటం విశేషం.

నియోజకవర్గాలవారీగా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
రాయదుర్గం	1,29,846	1,32,634	40	2,62,520
ఉరవకొండ	1,09,771	1,12,953	28	2,22,752
గుంతకల్లు	1,31,710	1,36,411	73	2,68,194
తాడిపత్రి	1.22.382	1,24,166	25	2,46,573
శింగనమల	1,21,957	1,23,314	29	2,45,300
అనంతపురం అర్బన్	1,36,376	1,42,063	27	2,78,466
కళ్యాణదుర్గం	1,13,187	1,15,028	07	2,28,222
రాప్తాడు	1,24,339	1,24,822	12	2,49,173

అక్రమాలు లేని ఎన్నికలే లక్ష్యం

నేర సమీక్షలో ఎస్పీ అన్బురాజన్



మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 28: హింస, అల్లర్లు, అక్రమాలు లేని ఎన్నికలే మన లక్ష్యమని, జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అంకితభావంతో పనిచేద్దామని ఎస్పీ అన్బురాజన్ పోలీసు అధికారులతో అన్నారు. తన చాంబర్‌లో డీఎస్పీలు, సీఐలతో గురువారం నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో జరిగిన నేరాలు, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, ఆస్తి సంబంధిత నేరాలను సమీక్షించారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పిద్దామని అన్నారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పని చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాలకు వచ్చిపోయే అనుమానిత, కొత్త వ్యక్తుల సమాచారం సేకరించాలని అన్నారు. చెక్‌పోస్టులలో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సూచించారు. తీవ్ర నేరాలలో షీట్స్ ఉన్న వారిపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు ఆంథోనప్ప, వీరరాఘవరెడ్డి, శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, సీఎం గంగయ్య, బీవీ శివారెడ్డి, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు.

ప్రార్థనా స్థలాలను ప్రచారాలకు వాడొద్దు: ఏడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 28: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఖాజీలు, పాస్టర్లు ప్రార్థనా స్థలాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించవద్దని మైనార్టీ సంక్షేమశాఖ ఉమ్మడి జిల్లా ఏడీ రామసుబ్బారెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఓట్లను పొందడం కోసం మతపరమైన విజ్ఞప్తి చేయరాదని అన్నారు. జిల్లాలోని ప్రార్థనా స్థలాలు, ఆడిటోరియాలు, బహిరంగ మైదానాలను ఏ రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు కేటాయించవద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వలంటీర్లపై వేటు



వైసీపీ ప్రచారంలో కణేకల్లు ఎమ్మెల్వో నుంకేష్



↓ వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వలంటీర్లు

అనంతపురం టౌన్, మార్చి 28: జిల్లాలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన మరో నలుగురు వలంటీర్లను కలెక్టర్ గౌతమి విధుల నుంచి తొలగించారు. వజ్రకరూరు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు శివయ్య, రాకెట్ల రమేష్, మహబూబ్ బాషా, నార్పల మండలం సిద్దరాచెర్ల సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీరు ఎం. సాయినాథ్‌రెడ్డిని విధుల నుంచి తొలగించారు. జిల్లాలో ఇప్పటివరకు 40 మంది వలంటీర్లు, ఐదుగురు డీలర్లు, 11 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై కోడ్ ఉల్లంఘనల చర్యలు తీసుకున్నామని కలెక్టరు తెలిపారు.

కేసు నమోదు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వలంటీర్ దాదాపీర్‌పై కేసు నమోదు చేశామని పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. ఇరువర్గాల మధ్య కక్షలు ప్రేరేపించేవిధంగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నందున దాదాపీర్‌ను అధికారులు విధుల నుంచి తొలగించారని వారు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రామమోహన్ ఫిర్యాదు మేరకు దాదాపీర్‌పై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

బొమ్మనహాళ్: మండల పరిధిలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇద్దరు జలంటీర్లపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఈ నెల 17న ఉద్దేహాళ్‌లో వైసీపీ కార్యాలయ ప్రారంభానికి మెట్టు గోవిందరెడ్డితో పాటు హరేసముద్రం వలంటీర్ రాముడు, గోవిందవాడ వలంటీర్ సుధాకర్ హాజరయ్యారని ఎంపీడీవో విజయమ్మ ఫిర్యాదు చేశారని వారు తెలిపారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎమ్మెల్వో ప్రచారం

బొమ్మనహాళ్: వైసీపీ రాయదుర్గం అభ్యర్థి తరపున కణేకల్లు ఎమ్మెల్వో నుంకేష్ బొమ్మనహాళ్ మండలంలో ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం దర్గాహోన్నూరులో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డితో కలిసి నుంకేష్ ప్రచారంలో పాల్గొన్నారు. నుంకేష్ వైసీపీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్నారని సమాచారం.

హంద్రీనీవాకు ఆగిన నీరు

ఏడు నెలల్లో 21 టీఎంసీల ఎత్తిపోత

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 28: హంద్రీనీవాకు కృష్ణా జలాల ఎత్తిపోతలను నిలిపేశారు. ఈ ఏడాది ఏడు నెలలా నాలుగు రోజులపాటు శ్రీశైలం డ్యాం నుంచి ముచ్చుమర్రి, మల్యాల నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కాలవకు కృష్ణా జలాలను తరలించారు. ఈ దఫా 31 టీఎంసీల నీటిని హంద్రీనీవాకు కేటాయించారు. ఇందులో ఏకంగా 10 టీఎంసీల నీరు వృథాగా చూపించారు. మిగిలిన 21 టీఎంసీలలో కర్నూలు జిల్లాకు 4.255 టీఎంసీలు, అనంతపురం జిల్లాకు 7.901 టీఎంసీలు, శ్రీసత్యసాయి జిల్లాకు 7.576 టీఎంసీలు, అన్నమయ్య జిల్లాకు 1.666 టీఎంసీల నీటిని వదిలారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 64 చెరువులకు నీటిని ఇచ్చామని హంద్రీనీవా అధికారులు చెబుతున్నా, ఒక్క ఎకరా ఆయకట్టుకూ నీరు ఇవ్వలేదు. 2023 ఆగస్టు 16వ తేదీన శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవాకు నీటి ఎత్తిపోతల మొదలైంది. ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగిందని హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్ తెలిపారు. ఆయకట్టుకు సాగునీరు ఇవ్వని మాట వాస్తవమేనని అన్నారు. నీటి ఎత్తిపోతల నిలిచిపోవడంతో ఇంజనీర్లతో కలిసి ఆయన గురువారం హంద్రీనీవా కాలవను పరిశీలించారు.



హంద్రీనీవా కాలవను పరిశీలిస్తున్న ఎస్ఈ దేసేనాయక్, ఇంజనీర్లు

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

గుంతకల్లు, మార్చి28: నైరుతి రైల్వే జోన్‌లో జరుగుతున్న రైల్వే ట్రాక్ పనుల కారణంగా కొన్ని రైళ్లను రద్దు, పాక్షిక రద్దుచేసి మరికొన్నింటిని దారిమళ్లించినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-ధర్మవరం-బెంగళూరు (06595/96) రైళ్లను ఏప్రిల్ 3, 10 తేదీల్లో రద్దుచేసినట్లు తెలిపారు. అలాగే ఈ రైళ్లను ఏప్రిల్ 7, 8 తేదీల్లో గౌరీబిదనూరు-ధర్మవరం సెక్షన్‌లో రద్దుచేసి, గౌరీబిదనూరు-బెంగళూరు మధ్య మాత్రమే నడపనున్నట్లు వివరించారు. జైపూర్-మైసూర్ ఎక్స్‌ప్రెస్ (నంబరు 12976) రైలును ఏప్రిల్ 1, 8 తేదీల్లో గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా కాకుండా గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం, అరిసికెరె, హసన్ స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా కలబురగి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నంబరు 22231) రైలును ఏప్రిల్ 3, 10 తేదీల్లో ఐదున్నర గంటల ఆలస్యంగానూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 22232)ను ఇవే తేదీల్లో గంట ఆలస్యంగానూ నడుస్తాయన్నారు.



ఇఫ్తార్	శుక్రవారం సాయంత్రం	06:33
సెహరీ	శనివారం ఉదయం	05:00

ఉష్ణోగ్రతలు (గురు)

గరిష్ఠం : 41.5
కనిష్ఠం : 25.0



ఓటేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి

12 రకాల ప్రత్యామ్నాయ కార్డులతోనూ ఓటేయవచ్చు: కలెక్టరు



అనంతపురం టౌన్, మార్చి 28: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటువేయడానికి ప్రతి ఓటరూ గుర్తింపు కార్డును తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని కలెక్టర్ గౌతమి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లందరికీ ఓటరు కార్డులు జారీ చేశామన్నారు. ఆ కార్డు లేనోళ్లు ప్రత్యామ్నాయంగా 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని చూపించి ఓటు వేయవచ్చన్నారు. ఇందులో ఆధారు కార్డు, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటోతో కూడిన గుర్తింపు కార్డులు, ప్రత్యేక వైకల్యం కార్డు.. చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమకు ప్రభుత్వం మంజూరు చేసిన అధికారిక గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.




చంద్రబాబుకు స్వాగతం చెప్పేందుకు..



బాబుకు స్వాగతం పలుకుతున్న నేతలు





గొర్రెపిల్లతో చంద్రబాబు..



జై తెలుగుదేశం..

దోపిడీ తోపులు

రాప్తాడు ఎమ్మెల్యే పిల్ల సైకో

రూ.15 కోట్లు డిమాండ్ చేసి జాకీని తరిమేశారు

ఎమ్మెల్యే తోపుదుర్తిపై టీడీపీ అధినేత చంద్రబాబు ఫైర్

రాప్తాడు, మార్చి 28: సీఎం జగన్ రాష్ట్రానికి సైకో అని, రాప్తాడులో కూడా పిల్ల సైకో తయారయ్యాడని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దోపిడీలో తోపుగా మారాడని అన్నారు. రాప్తాడులో గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. తోపుదుర్తి సోదరులు కమీషన్ల పేరిట దోపిడీ చేస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ తీసుకొస్తే.. తోపు రూ.15 కోట్లు కమీషన్ డిమాండ్ చేశారని, దీంతో జాకీ తెలంగాణకు తరలిపోయిందని అన్నారు. రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటై ఉంటే వందల మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు లభించేవని అన్నారు. రాప్తాడు సమీపంలోని ఆటో నగర్ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాల డెయిరీ పేరుతో రూ.కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. రాప్తాడు నియోజకవర్గం ఒకప్పుడు అభివృద్ధిలో ముందుండేదని, వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి, భూ దందాలు, ఇసుక, మట్టి మాఫియాతో కుతకుతలాడిపోతోందని అన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన ఎమ్మెల్యే.. పనులు చేయకుండా రూ.కోట్లు కొల్లగొడుతున్నాడని విమర్శించారు. వైసీపీ పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమంగా కేసులు పెట్టారని, బొక్కిన వాడిని ఎవరినీ వదిలిపెట్టనని చంద్రబాబు అన్నారు. 'మా తమ్ముళ్ల పడిన కష్టాలకు వడ్డీతో చెల్లించే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది' అని భరోసా ఇచ్చారు. అన్నింటిపై విచారణ జరిపించి, దోషులను శిక్షించే బాధ్యత తనదేనని అన్నారు.

బాబు వరాలు..

టీడీపీ అధినేత చంద్రబాబు రాప్తాడు నియోజకవర్గానికి వరాల జల్లులు కురిపించారు. అధికారంలోకి రాగానే అనేక అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. పేరూరు చెరువుకు నీళ్లు ఇచ్చే బాధ్యత టీడీపీదేనని అన్నారు. అనంతపురం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమరవాండ్లపల్లి ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని అన్నారు. టమోటా, వేరుశనగ, చీనీ తదితర వాణిజ్య పంటలకు సబ్సిడీ వర్తింపజేస్తామన్నారు. చెన్నేకొత్తపల్లి మండలం వెంకటపల్లి సమీపంలోని దేవరకొండ ప్రాజెక్టు విషయంలో రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు జీతాలు చెల్లిస్తామని అన్నారు.



రాప్తాడు ప్రజాగళం సభకు పోటెత్తిన అభిమానులు

● జగన్ రాక్షస పాలన



ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనుకబడిపోయింది. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. 2014 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14కుగానూ టీడీపీని 12 స్థానాల్లో గెలిపించారు. చంద్రబాబు అనంతను అభివృద్ధి పథంలో నడిపించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రూ.13 వేల కోట్లతో పెనుగొండ వద్ద కియ పరిశ్రమ ఏర్పాటు చేయించారు. దీంతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. యువతకు 50 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే. హంద్రీనీవా పూర్తి చేసి గొల్లపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నీరిచ్చి రైతులను ఆదుకున్నారు. సబ్సిడీతో రైతులకు డ్రిప్పు, ఏటా ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి అండగా నిలిచారు. 2019లో కూడా ముఖ్యమంత్రి అయ్యుంటే జిల్లాను మరింత అభివృద్ధి చేసేవారు. కియకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు వచ్చేవి. యువతకు మరిన్ని ఉద్యోగాలు వచ్చేవి. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే 2 ఎంపీలను గెలిపించుకోవాలి.

- బీకే పార్థసారథి, హిందూపురం ఎంపీ అభ్యర్థి



అక్రమాలకు అడ్డాగా మార్చారు



వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తోపుదుర్తి సోదరులు రాప్తాడును అవినీతి, అక్రమాలు, అరాచకాలకు అడ్డాగా మార్చేశారు. అక్రమార్జనతో రూ.కోట్లు సంపాదించారు. సొంత పార్టీ నేతలను కూడా ఇబ్బంది పెడుతున్నారు. భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కమీషన్లు వసూలు చేసి కోట్లకు పడగలెత్తారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు సహకారంలో రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిచింది. వైసీపీ ప్రభుత్వంలో అరాచక పాలన సాగించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎత్తిన టీడీపీ జెండా కిందకు దించలేదు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వెళ్లారు. ఎన్నికలు దగ్గర పడ్డాయి. ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలి. అరాచక వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు రాప్తాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారు. ఖచ్చితంగా టీడీపీ అధికారంలోకి వస్తుంది. రాప్తాడు నియోజకవర్గాన్ని చంద్రబాబు మరింత అభివృద్ధి చేస్తారు.

- పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి



దోపిడీదారులను గద్దె దించాలి



వైసీపీ అధికారంలోకి వచ్చాక రాప్తాడులో తోపుదుర్తి సోదరులు దోపిడీదారులుగా మారారు. ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి వారిని ఇంటింకి సాగనంపాలి. కూటమి అభ్యర్థి పరిటాల సునీత గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కియ పరిశ్రమ తరహాలో రాప్తాడులో కూడా ఐటీ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. రాప్తాడును అభివృద్ధి పథంలో నడిపించాలి.

- సాకే పవన్, జనసేన రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జి

3 వేల కేసులు పెట్టారు

- మాజీ మంత్రి పరిటాల సునీత



● వైసీపీ అధికారంలోకి వచ్చిన తారువాత తనపైన, పరిటాల శ్రీరామ్ పైన, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలపైన మొత్తం మూడు వేల అక్రమ కేసులు పెట్టించారని వైసీపీ నాయకులపై మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. జిల్లాలో ఎక్కడా లేనన్ని కేసులు రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం పెట్టించిందని అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా రాక్రీట్ సంస్థ పేరుతో రాప్తాడు ఎమ్మెల్యే రూ.వేల కోట్లు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఐదు జిల్లాలలో కాంట్రాక్టు తీసుకుని, అక్రమంగా కోట్లు సంపాదిస్తున్నారని అన్నారు.

● టీడీపీ హయాంలో జాకీ పరిశ్రమ తీసుకొస్తే వైసీపీ అధికారంలో వచ్చాక ఎమ్మెల్యే, ఆయన సోదరులు రూ.15 కోట్లు డిమాండ్ చేసి తెలంగాణాకు తరిమికొట్టారని అన్నారు. పాల డెయిరీ ఏర్పాటు చేస్తామని ఒక్కో డ్వాక్రా మహిళలతో రూ.10 వేలు చొప్పున రూ.10 కోట్లు వసూలు చేశారని, నాలుగేళ్ల తరువాత తాము నిలదీస్తే కొంత మంది మహిళలకు మాత్రమే డబ్బు వెనక్కి ఇచ్చారని అన్నారు. నాలుగేళ్లు ఆ డబ్బుతో రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేశారని ఆరోపించారు.

● అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక, మట్టి మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి రూ.వందల కోట్లు వసూలు చేశారని అన్నారు. 'రిజర్వాయర్లు నిర్మించి, పిల్ల కాలువల ద్వారా లక్ష ఎకరాలకు నీరిస్తామని ప్రకాష్‌రెడ్డి జగన్ సమక్షంలో రైతులకు హామీ ఇచ్చారు. హామీ నెరవేర్చకపోతే మీసం తీయిచుకుంటా అన్నాడు. రిజర్వాయర్ల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదు. రైతులకు ప్రకాష్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ఎన్నికల ముందు నా బనియన్ బొక్కలు పడ్డాయి, ఇల్లు అమ్ముకున్నా.. ఈ సారి ఓటు వేయకపోతే పూల దండ వేయాల్సిందే అని చెప్పారు. గెలుపు కోసం పని చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీలను అధికారంలోకి వచ్చాక ప్రకాష్‌రెడ్డి ఇంటి గేటు కూడా తాకనివ్వలేదు. అలాంటి వ్యక్తికి ఎన్నికల్లో ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పేందుకు రాప్తాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఎదురుచూస్తున్నారు..' అని పరిటాల సునీత అన్నారు.

● జగన్ ఫ్యాక్షన్ సీఎం అని, ఆయనను గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాప్తాడు నియోజకవర్గంలో రూ.5 వేల కోట్లతో అభివృద్ధి చేశామని, 45 చెరువులు, చెక్‌డ్యాంలకు నీరిచ్చామని అన్నారు. పేరూరు డ్యాంకు శాశ్వతంగా నీరిచ్చేందుకు రూ.803 కోట్లతో కాలువ పనులు ప్రారంభించామని, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయని అన్నారు. కాలువ కోసం భుములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే పరిహారం ఇవ్వాలని చంద్రబాబును కోరారు. పది ఎకరాల భూమి ఉందని సాకు చూపుతూ.. రేషన్ కార్డులు, ఫించన్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. 'రాప్తాడు ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, గంగలకుంట చెరువుకు శాశ్వతంగా నీరు వచ్చేందుకు నిధులు, సీకే పల్లిలో హార్టికల్చర్ హబ్, రూరల్ మండలానికి తాగు నీరు, నడిమి వంకకు రక్షణ ఏర్పాటు చేయాలని చంద్రబాబును కోరారు. ఎన్ని కష్టాలు వచ్చినా పరిటాల కుటుంబం మీ వెంటే ఉంటుందని చంద్రబాబుకు ఆమె హామీ ఇచ్చారు.

శింగనమలను దోచేశారు

- ఎమ్మెల్యే, ఆమె భర్త అవినీతికి అడ్డు లేదు
- కాళ్ల వద్ద పడుంటాడని టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చారు
- శ్రావణి శ్రీని గెలిపించండి.. అభివృద్ధి చేసే బాధ్యత నాది
- బుక్కరాయసముద్రం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



ప్రసంగిస్తున్న బండారు శ్రావణిశ్రీ



బుక్కరాయ సముద్రంలో బాబు ప్రసంగం..

బుక్కరాయసముద్రం, మార్చి 28: శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి అవినీతికి అడ్డు అదుపు లేకుండాపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యేని కాదని, వారి ఇసుక టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇచ్చారని, అలా అయితే నియోజవర్గం అంతటా దోచుకోవచ్చని వారి ఆలోచన అని విమర్శించారు. బుక్కరాయసముద్రంలో గురువారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే, ఆమె భర్త నియోజకవర్గంలో 500 ఎకరాల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. రెండన్నర ఎకరాల ఎస్సీల శ్మశ్మాన భూమిని కూడా కబ్జా చేశారంటే.. పరిస్థితి ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను ఆక్రమించారని, సోలార్, విండ్ పవర్ కంపెనీ యాజమానులను బెదిరించి, నెలవారీ మాముళ్లు తీసుకుంటాన్నారని ఆరోపించారు. సీఎం జగన్, సాంబశివారెడ్డి పథకం ప్రకారం వైసీపీ అభ్యర్థిని ఎంపిక చేశారని అన్నారు. అగ్రవర్ణాల వారి కాళ్ల వద్ద పడి ఉంటారని టిప్పర్ డ్రైవర్‌ను అభ్యర్థిగా పెట్టారని, వారి తెలివికి జోహర్లు అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతోందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో శింగనమలలో చరిత్ర తిరగరాస్తామని అన్నారు.

ఏం చేశావో చెప్పు జగన్..

శింగనమల నియోజకవర్గానికి గడిచిన ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని సీఎం జగన్‌ను చంద్రబాబు నిలదీశారు. ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చాక అనేక హామీలు ఇచ్చారని,ఈ ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. 'శింగనమల మండలంలోని ఉల్లికల్లు గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.162 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు, కానీ ప్రారంభించలేదు. శింగనమలలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. మిడ్ పెన్నార్ డ్యాంకు గేట్లు మరమ్మతులు, లీకేజీ నివారణకోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ పనులు చేయలేదు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. గార్లదిన్నె, శింగనమలలో టీడీపీ హయంలో 95 శాతం నిర్మించిన షాదీఖానాలు ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. ఇలాంటి ముఖ్యమంత్రి రాజధానిని కడతారా? ప్రజలు ఆలోచించాలి' అని చంద్రబాబు అన్నారు.

అవినీతి కావాలా..? సేవ కావాలా..? - బండారు శ్రావణి శ్రీ

'శింగనమల నియోజకవర్గంలో అవినీతి ఎమ్మెల్యే కావాలా..? నిరంతరం ప్రజలకు సేవ చేసే నాయకురాలు కావాలా..? మీరే నిర్ణయించుకోండి' అని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ ప్రజలను కోరారు. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి దౌర్జన్యాలు, అవినీతితో పెట్రేగిపోయారని అన్నారు. 'ఎమ్మెల్యే అవినీతికి పాల్పడినందుకే ఆమెకు టిక్కెట్ నిరాకరించారని వైసీపీ నాయకులే అంటున్నారు. మళ్లీ దోచుకునేందుకు వారి ఇసుక దందాలో భాగసామ్యం అయిన టిప్పర్ డ్రైవర్‌కు టిక్కెట్ ఇప్పించుకున్నారు. బినామీ అయితే నియోజకవర్గంలో మరింత దోచుకోవచ్చుని పథకం వేశారు..' అని శ్రావణి విమర్శించారు. 'మీ ఆడబిడ్డగా సేవ చేసేందుకు ఒక అవకాశం ఇవ్వండి' అని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పెత్తందార్ల వ్యవస్థ కొనసాగుతోందని, ఆలూరు సాంబశివారెడ్డి ఆరాచకాలకు నియోజకవర్గం ప్రజలు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి: ఆలం



ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పిలుపునిచ్చారు. అనంతపురం ఎంపీగా తలారి రంగయ్యను గెలిపిస్తే.. ఐదేళ్లలో ఎక్కడో ఉన్నారో ప్రజలుకు తెలియదని అన్నారు. అలాంటి వైసీపీ నేతలను మళ్లీ గెలిపిస్తే.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని అన్నారు. శింగనమలలో ఏ పని జరగలన్నా ముడుపులు ముట్టజెప్పాల్సివస్తోందని విమర్శించారు. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇలాంటి అవినీతి ఎమ్మెల్యేని చూడలేదని అన్నారు. ఐదేళ్ల డబ్బు సంపాదించుకుని, ప్రస్తుతం అడ్రస్ లేకుండా పోయారని విమర్శించారు.

శ్రావణిని గెలిపించండి..

● జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, టీడీపీ అభ్యర్థి శ్రావణి శ్రీని గెలిపిస్తే తాము నెరవేరుస్తామని చంద్రబాబు అన్నారు. టిప్పర్ డ్రైవర్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో అంధకారం అలుముకుంటుందని హెచ్చరించారు. పార్టీ ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి తదితర సీనియర్ నాయకులు కలిసి పనిచేసి శ్రావణిని గెలిపించాలని సూచించారు. వారి భవిష్యత్తుకు పార్టీ భరోసా కల్పిస్తుందని అన్నారు.

● ఉమ్మడి జిల్లాలో వెనుకబడిన కులాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాలలో ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు అన్నారు. పార్టీకి వెన్నెముకలాంటి బీసీలకు తగిన న్యాయం చేస్తామని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీలను పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు కురుబ కులస్థులు కంబళి, గొర్రెపిల్లను బహూకరించారు.

సాగునీటితోనే అనంత అభివృద్ధి

వలసలు ఆపడానికి అనంతలో మరిన్ని పరిశ్రమలు

మైనార్టీ విద్యాసంస్థలు పూర్తి చేస్తాం

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు.. టీడీపీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటన

కదిరి, మార్చి 28: సాగునీటితోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి సాధ్యమని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్య క్షుడు నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించారు. పూలే సర్కిల్‌లో చంద్రబాబు మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాకు నీరు వస్తే పంటలు పండుతాయన్నారు. నీరు వస్తే పరిశ్రమలు కూడా వస్తాయనీ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పంటలు, పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. కియ లాంటి పరిశ్రమలు మరెన్నో జిల్లాకు తీసుకొస్తామన్నారు. యువతకు ఇంటి వద్దే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మండల కేంద్రాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల వద్దే ఉద్యోగాలు చేసుకునే సౌకర్యం కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియోజకవర్గం పులివెందుల పక్కనే ఉన్న కదిరిని అభివృద్ధి చేయకుండా, బాబాయిని చంపడానికి ఓ గొడ్డలి తయారీకి ఉపయోగించారని ఎద్దేవా చేశారు.

కదిరికి వరాల జల్లు

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభలో కదిరికి వరాలు జల్లు కురిపించారు. తాము అధికారంలోకి వస్తే కదిరిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా తానే ముఖ్యమంత్రి హోదాలో పట్టువస్త్రాలు తీసుకు వస్తానన్నారు. హంద్రీనీవా జలాలను నంబులపూలకుంట, గాండ్లపెంట, తలుపుల మండలాలకు ఇస్తామన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కదిరికి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కదిరి బైపాస్ రోడ్డును ఔటర్ రింగ్‌రోడ్డుగా మారుస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న కదిరిలోని అన్ని మైనార్టీ విద్యాసంస్థలను పూర్తి చేస్తామన్నారు. కదిరిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథిని గెలిపిస్తారనీ, ఇందులో తనకేమీ సందేహం లేదన్నారు. కార్యక్రమంలో కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, హిందూపురం పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవప్రసాద్, బీజేపీ యువమోర్చా నాయకుడు వంశీ తదితరులు ప్రసంగించారు.



తమ్ముళ్లూ.. వైసీపీకి చరమగీతం పాడండి



దారి పొడవునా అభిమానమే..



జనమే.. జనం



యువహో..



ప్రసంగిస్తున్న టీడీపీ కదిరి ఇన్‌చార్జి కందికుంట ప్రసాద్



కార్యకర్త జోరు..

బాబు జిల్లా పర్యటన సక్సెస్

వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు - పసుపుమయమైన రాప్తాడు




రాప్తాడులో మాట్లాడుతున్న చంద్రబాబు, టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

రాప్తాడు/ బుక్కరాయసముద్రం/ అనంతపురం అర్బన్, మార్చి 28: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశానికి రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ద్విచక్రవాహనాలు, బస్సుల్లో వేలాదిగా తరలి వచ్చారు. అనంతపురం నగరం శివారులోని హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో చంద్రబాబు రాప్తాడుకు చేరుకున్నారు. అప్పటికే రాప్తాడులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, సభకు విచ్చేసిన జనాల్ని చేసి చంద్రబాబు సంతోషం వ్యక్తంచేశారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా చంద్రబాబు ప్రసంగం కోసం ఎదురుచూశారు. రోడ్డు మీద, ఇళ్లపైన, చెట్లపైనా ఎక్కడ పడితే అక్కడ నిలబడి చంద్రబాబు ప్రసంగాన్ని విన్నారు. ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడు తుండగా వాహనం ఎదుట ఉన్న యువత సీఎం...సీఎం అంటూ కేరింతలు వేశారు. 45 నిమిషాల చంద్రబాబు ప్రసంగాన్ని ఎంతో ఆసక్తిగా విన్నారు. ప్రజాగళం సభకు వచ్చిన వారికి భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. సభలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, చంద్రదండు ప్రకాష్‌నాయుడు టీం సభ్యులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

హెలీప్యాడ్ వద్ద బాబుకు ఘనస్వాగతం

రాప్తాడులో నిర్వహించిన ప్రజాగళం సభకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబుకు హెలీప్యాడ్ ఘనస్వాగతం పలికారు. అనంతపురం నగరంలోని రాంనగర్ అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు రాగానే పలువురు ముఖ్యనేతలు బాబుకు ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు, పల్లెరఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, పార్థసారధి, పెనుగొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు బీవీ రాముడు, ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, రాప్తాడు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సాకే పవన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, గంజే నాగరాజు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

పాల్గొన్న నాయకులు

చంద్రబాబు జిల్లా పర్యటనలో పలువురు టీడీపీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు. రాప్తాడులో రాష్ట్ర పార్టీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, రవియాదవ్, రాజశేఖర్, కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, నంబూరి రమణ, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, నెట్టెం లక్ష్మీనారాయణ, జయరాముడు, మరూరు గోపాల్, ఇంద్ర, కిష్టా, ఆరు మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు చంద్రబాబును కలిశారు. అలాగే బుక్కరాయసముద్రం సభలో టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఆలం వెంకటనరసానాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, డేగల క్రిష్ణమూర్తి, చితంబరి దొర, జీసీ బాబు, మాజీ జెడ్పీటీసీలు విశాలాక్షి, షాలిని, కన్వీనర్ అశోక్, మండల కన్వీనర్ అశోక్, నేతలు కేశన్న, లక్ష్మీనారాయణ, ఎస్ నారాయణస్వామి, సురేష్‌చౌదరి, బాలరంగయ్య, సుదర్శన్ నాయుడు, సీపీఎస్ఎస్, పాండు, ఎర్రినాగప్ప, గుత్తా ఆదినారాయణ, గేట్ క్రిష్టారెడ్డి, ఇల్లూరు రామాంజినేయులు, మల్లిఖార్జునరెడ్డి, రామానాయుడు, నరేంద్రయాదవ్, మల్లేష్, ఓబులపతి, వెంకటనాయుడు జొన్నారామయ్య, రాము, పెద్దప్ప, దాసరిగంగాధర్, పటేల్ భూసి, హరి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీటీసీ ఆవుల మాధవరెడ్డి, మరికొందరు వైసీపీ నాయకులతో కలసి గురువారం రాప్తాడులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిని మాజీ మంత్రి పరిటాల సునీత దగ్గర ఉండి పార్టీలోకి ఆహ్వానించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యుల తీరుతో విసిగిపోయి తాము టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ నాయకులు సద్దికూటీ శివారెడ్డి, గూలి వెంకట్రామిరెడ్డి, ఆవుల పోలిరెడ్డి, ఆవుల శ్రీరామిరెడ్డి, ఆవుల బుసిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకుడు రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ప్రముఖులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడును పలువురు ప్రముఖులు కలిశారు. బుక్కరాయసముద్రం ప్రజాగళం సభలో జిల్లా సీనియర్ నేత ఆలం వెంకటనరసానాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, హెలిప్యాడ్ వద్ద జనసేన నాయకులు కాయగూరల లక్ష్మీపతి వెన్నెల కృష్ణ, దివాకర్, తోట ప్రకాష్ కలిశారు. హెలిప్యాడ్ వద్ద చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ గుంతకల్లు ఎమ్మెల్యే టికెట్ తనకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.






చంద్రబాబును కలిసిన ఆలం వెంకటనరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు, లక్ష్మీపతి, వెంకటశివుడు యాదవ్

రేషన్ సరుకులపై నవరత్నాల గుర్తులు ఉండరాదు

అనంతపురంరూరల్, మార్చి 28: రేషన్ నిత్యవసరాలపై నవరత్నాల గుర్తులు ఉండకూడదని అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ సూచించారు. గురువారం కార్యాలయంలో ఎండియూ ఆపరేటర్లు, రేషన్ షాప్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ షాపులు, ఎండియూ యూనిట్ల మీద రేషన్ వాహనాల మీద సీఎం, నవరత్నాల ఫొటోలు ఉండకూడదన్నారు. అలాగే రేషన్ వాహనాల్లో రాజకీయపరమైన ఆడియోలు ఉండరాదన్నారు. వీటిని ధిక్కరిస్తే ఎన్నికల నియమాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా రాజకీయపరమైన మీటింగ్‌లు, ర్యాలీలు, ప్రచారాలకు వెళితే సస్పెండ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సిద్దరాచెర్ల వలంటీర్ తొలగింపు

నార్పల, మార్చి 28: మండలంలోని సిద్దరాచెర్ల గ్రామ వలంటీర్ సాయినాథ్‌రెడ్డిని తొలగించినట్లు ఎంపీడీఓ రాముడు గురువారం తెలిపారు. ఎన్నికల ప్రచారంలో అతను పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం వచ్చిందని, విచారణలో ఆ వలంటీర్ ఎన్నికల కోడ్ ఉల్లఘించి ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిందని, దీంతో అతన్ని విధుల నుంచి తొలగించామని ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హాస్టల్ వార్డెన్ మృతి



నాగరాజు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, మార్చి 28: మండలంలోని నాగసముద్రం క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ హాస్టల్ వార్డెన్ మరణించాడు. చెన్నేకొత్తపల్లికి చెందిన పీ.నాగరాజు (57) తాడిమర్రి బీసీ బాలుర వసతి గృహ వార్డెన్‌గా పనిచేస్తుండేవాడు. బుధవారం రాత్రి తాడిమర్రి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా.. నాగసముద్రం వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించబోయి రోడ్డు పక్కన గుంతలో పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ నాగరాజును అక్కడ ఉన్న వారు 108 వాహనంలో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూర్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. నాగరాజుకు భార్య వెంకటలక్ష్మీ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతదేహానికి పలువురు హాస్టల్ వార్డెన్లు నివాళులర్పించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, మార్చి 29: మద్యం ఎక్కువగా తాగిన ఓ వ్యక్తి డీహైడ్రేషన్‌కు గురై మరణించాడు. రవికుమార్ (38) అనే వ్యక్తికి కుటుంబ సభ్యులు లేరు. ఇల్లు లేదు. ఫెర్రర్‌నగర్ కాలనీలో తిరిగేవాడు. నిత్యం మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో గురువారం మద్యం తాగి ఆ మత్తులో గుత్తిరోడ్డులోని మార్కెట్‌యార్డు ఆవరణంలో పడిపోయాడు. ఎండవేడిమి ఎక్కువ కావడంతో... స్థానికంగా ఉన్న వారు నీరు అందించారు. కొంతసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణించాడు. కాగా ఇతను గతంలో ఓ హత్య కేసులో నిందితుడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ తెలిపారు.

శివబాలయోగి ఆశ్రమంలో విశేష పూజలు



అనంతపురం కల్చరల్, మార్చి 28: శివబాలయోగి మహరాజ్ స్వామి శివైక్యం చెందిన రోజును పురస్కరించుకుని గురువారం నగర శివారు శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో విశేష పూజలను నిర్వహించారు. శివబాలయోగిస్వామి మూలవిరాట్‌కు భక్తులతో సామూహిక పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ ఆవరణంలో భక్తిగీతాలు ఆలపిస్తూ భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్‌గుప్త, ఉపాధ్యక్షుడు దేవరాజు, భక్తులు పాల్గొన్నారు.

'అనంత అర్బన్ టిక్కెట్ మైనార్టీలకే ఇవ్వాలి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 28: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే టిక్కెట్ మైనార్టీలకే ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐఎంఎం మహబూబ్ బాషా డిమాండ్ చేశారు. గురువారం ఆ జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... నగరంలో ముస్లిం, బలిజలు ఎక్కువ శాతం ఉన్నా రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మైనార్టీలను అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి... అధికారంలోకి వచ్చాక మాట మారుస్తూ ఆ వర్గాలకు తీరని అన్యాం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కేవలం మైనార్టీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారేగానీ.. వారికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో టిప్పు సుల్తాన్ అభిమాన సంఘం అధ్యక్షుడు జాకీర్, ప్రజాబలం రాష్ట్ర అధ్యక్షుడు నజీర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



నరసింహులు (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, మార్చి 28: మండలంలోని హరియన్ చెరువు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్యాధిండి నరసింహులు (50) గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం అర్ధరాత్రి ఇంటిలో ఉండగా ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. నరసింహులుకు భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి గురువారం ఉదయం నరసింహులు మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, మాడెం సూర్యనారాయణరెడ్డి, న్యామద్దల కిష్టప్ప, బండారు బార్గవ, గేటు కిష్టప్ప ఉన్నారు.

చీనీకాయలు టన్ను రూ.25 వేలు

అనంతపురంరూరల్, మార్చి 28: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25,500, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.17 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 738 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

దగ్ధమైన డ్రిప్ పరికరాలు

ఆత్మకూరు మార్చి 28: ఆత్మకూరుకు చెందిన దాదులూరి పోతన్న పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పులు పడటంతో గురువారం మంటలు చెలరేగి.. డ్రిప్పు పరికరాలు దగ్ధమయ్యాయి. దీంతో తనకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని వాపోయారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానని, అధికారులే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

30న ఎండ్‌లైన్ పరీక్షలు నిర్వహించాలి

అనంతపురం విద్య, మార్చి 28 : అన్ని ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో శనివారం లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్‌ఐపీ) ఎండ్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6,7,8 తరగతుల విద్యార్థులకు రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలు ఉపయోగించి తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జక్టుల్లో పరీక్షలు నిర్వహించాలన్నారు. సంబంధిత టీచర్లు పరీక్షలు నిర్వహించి రికార్డులను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఉన్న స్కూళ్లలో ప్రశ్నాపత్రాలను డిజిటల్ రూపంలో చూపించి, పరీక్షలు రాయించాలన్నారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

విధుల్లో చేరిన ఏఓ

అనంతపురం రూరల్, మార్చి 28: మండల వ్యవసాయాధికారిని శశికళ గురువారం విధుల్లో చేరారు. గత ఏడాది నవంబరులో ఆమె మెటర్నటీ లీవ్‌లో వెళ్లారు. ఆ తరువాత ఇన్‌చార్జ్ ఏఓగా సాయిలక్ష్మి విధులు నిర్వహిం చారు. ఆమె కూడా సెలవు పెట్టడంతో మరో అధికారి సోమశేఖర్ ఇన్నాళ్లు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. సెలవులో వెళ్లిన రెగ్యులర్ ఏఓ శశికళ తిరిగి విధుల్లో చేరారు.

ఉగాది ఏర్పాట్లపై సమీక్ష

గుంతకల్లు, మార్చి 28: ఉగాది పండుగను పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం ఈఓ వై భద్రాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తామని, రథోత్సవం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఆర్డీవో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు మునిసిపాలిటీ, కసాపురం పంచాయతీ, పోలీసు, ఆలయ సిబ్బంది, వైద్య శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ సిబ్బంది ఉత్సవాల ఏర్పాట్ల విషయంగా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయ ఏఈఓ మల్లికార్జున, ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, తహసీల్దారు శేషఫణి, అధికారులు పాల్గొన్నారు.

వేలంపాట ద్వారానే చీనీ అమ్మకాలు చేపట్టాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 28: అనంతపురం మార్కెట్ యార్డులో వేలంపాట ద్వారా మాత్రమే చీనీకాయల అమ్మకాలు చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రైతుసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దాదాపు 42,490 ఎకరాల్లో 10,62,260 టన్నుల చీనీ పంటను రైతులు పండిస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ఎరువులు, పురుగు మందులు, చీడపురుగులు, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని అనేక ఇబ్బందులను భరిస్తూ రైతులు చీనీ పంటను పండిస్తున్నారన్నారు. పాలకులు రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంవల్ల దళారుల చేతుల్లో మోసపోవాల్సి వస్తోందన్నారు. పంటను మార్కెట్‌కు తెచ్చిన రైతుకు సరైన ధర రావడం లేదని తెలిపారు. మార్కెట్‌లో మొదటి రకం చీనీ టన్నుకు రూ.25 వేలకు అమ్ముడవుతోందని, అదికూడా గాలివాటంగా ఉందని తెలిపారు. రైతులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈనాం విధానంలో రైతులకంటే కొనుగోలుదారులకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందన్నారు. వ్యాపారస్తులు సిండికేట్ అయి రైతుకు ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి రైతులు నష్టపోకుండా ఈనామ్‌ను రద్దుచేసి మార్కెట్‌లో వేలంపాట ద్వారా అమ్మకాలు జరిపి, సూట్ తీసుకునే విధానాన్ని రద్దు చేసి... సూట్‌కు చీనీ కాయలు కొనేవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తీసుకుంటున్న కమీషన్‌ను పది శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, రైతుసంఘం నాయకులు విరూపాక్షి, రాజారామిరెడ్డి, పోతులయ్య, రెడ్డిపల్లి శ్రీనివాసులు, రాముడు, రమేష్, చంద్రశేఖర్, గాండ్ల శివారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, సిబ్బంది

అనంతపురం సెంట్రల్, మార్చి 28: ఆర్ట్స్ కళాశాల డిగ్రీ పరీక్షల ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్‌రెడ్డి, సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... డిగ్రీ ఆర్ట్స్, కామర్స్, సైన్స్ విద్యార్థులకు డిసెంబరులో ప్రథమ, తృతీయ, ఐదో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 1,261 మంది విద్యార్థులకు గాను 826 మంది పాస్ కాగా 435 మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. అదేవిధగా మూడో సెమిస్టర్‌లో 855 మందికిగాను 449 మంది, ప్రథమ సెమిస్టర్‌లో 1,028 మందికిగాను 657 మంది విద్యార్థులు పాస్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ చలపతి, ప్రభాకర్‌రెడ్డి, ఫుల్‌సింగ్ పాల్గొన్నారు.

ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

అనంతపురం క్రైం, మార్చి 28: రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిపై ఇచ్చిన రాయితీ మరో మూడు రోజుల్లో ముగియనుంది. పన్ను బకాయి ఒకేసారి ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించింది. ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మేఘస్వరూప్ సూచించారు. నెలాఖరులో సర్వర్ ఆన్‌లైన్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా జమవుతుందన్నారు. బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశామన్నారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా అపరాధ రుసుము లేకుండా చెల్లించడానికి ఇదొక అవకాశమన్నారు. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక క్యాష్ కౌంటర్లను ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయని, పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అనంతపురం క్రైం, మార్చి 28: నగరపాలిక పరిధిలో పనిచేస్తూ మరణించిన ఔట్‌సోర్సింగ్ కార్మికుని కుటుంబానికి తోటి కార్మికులు ఆర్థికసాయం అందించారు. కొన్ని రోజుల క్రితం ఐదో సర్కిల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు ఎట్టి కుళ్లాయప్ప మృతిచెందాడు. మున్సిపల్ కార్మికులు తమ ఒక రోజు వేతనం రూ.400 చొప్పున ఔట్‌సోర్సింగ్ కార్మికులందరూ రూ.96వేలు సాయం చేశారు. కార్మికుడి కుటుంబసభ్యులకు నగర కమిషనర్ మేఘస్వరూప్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆ నగదును గురువారం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయు నగర కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏటీఎం నాగరాజు, నాగభూషణం, ముత్తరాజు, నల్లప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

లా పరీక్షలో మాస్ కాపీయింగ్.. పదిమంది డిబార్



పరీక్షాకేంద్రంలో తనిఖీ చేస్తున్న వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 28: ఎస్కేయూలో నిర్వహిస్తున్న లా పరీక్షల్లో మాస్ కాపీయింగ్ యథావిధిగా కొనసాగుతోంది. గురువారం నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా పదిమంది విద్యార్థులు డిబార్ అయ్యారు. పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణతో కలిసి వీసీ హుస్సేన్‌రెడ్డి అకస్మాత్తుగా పరీక్షా కేంద్రాలను తనఖీచేశారు. వారు మాట్లాడుతూ తృతీయ, ఐదు సంవత్సరాల లా కోర్సుల విద్యార్థులకు 26 నుంచి మే 9వరకు ఐదవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం నిర్వహించిన పరీక్షలకు 370మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన విజయనగర లా కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులను డిబార్ చేశామన్నారు. అదేవిధంగా మే 11నుంచి 19వరకు ఏడో సెమిస్టర్. 20 నుంచి 26 వరకు పదో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేదిలేదని, డిబార్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీరాములు నాయక్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పంటల్లో కొత్త వంగడాలు ప్రవేశపెట్టేలా చర్యలు

అనంతపురం అర్బన్, మార్చి 28: జిల్లాలో రాబోవు సీజన్లల్లో వివిధ పంటల్లో కొత్త వంగడాలు ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పదేళ్లుగా కే-6 రకం వేరుశనగ సాగుచేస్తున్నందున దిగుబడి తగ్గుతోందన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులను తట్టుకునే కొత్త వంగడాలను ప్రవేశపెట్టేందుకు చొరవ చూపాలన్నారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులు వచ్చే కదిరి - 9, కదిరి లేపాక్షి - 1812, టీసీజీఎస్-1694 (వశిష్ట) రకాలను రైతులకు అందుబాటులో ఉంచి సరఫరా చేసేందుకు సిద్ధం కావాలన్నారు. కంది పంటలో ఎల్‌ఆర్‌జీ - 41 రకానికి బదులుగా పీఆర్‌జీ - 176, కొర్ర పంటలో సూర్య నంది లేదా గరుడ రకాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, ప్రసన్న రాజేష్, మల్లేశ్వరి, రాధాకుమారి, ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.

ప్రమాదంలో జీవావరణ ప్రక్రియ

అనంతపురం సెంట్రల్, మార్చి 28: ప్రస్తుతం జీవావరణ ప్రక్రియ ప్రమాదంలో పడిందని.. అడవులను హరిస్తూ పర్యావరణం వేడెక్కిస్తున్న మానవ పర్యవస నాలే ఇందుకు కారణమని ఎస్కేయూ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రవిప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఆర్ట్స్ కళాశాలలో 'మొక్కల పరిరక్షణ వ్యూహాలలో దృక్పథం' అనే అంశంపై విద్యా ర్థులతో ఇంటరాక్ట్ సెషన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పర్యావరణం, జీవ వైవిధ్య, నైతిక విలు వలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను సమాజంలో పరిశీలిస్తే వాస్తవాలను గుర్తిస్తారన్నారు. తద్వారా కొత్త ఆలోచనలతో పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించి మొక్కల పరిరక్షణకు పాటుపడుతారని తెలిపారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులతో మాట్లాడించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దివా కర్‌రెడ్డి, కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీదేవి అధ్యాపకులు అమృత లక్ష్మి, విష్ణుప్రియ, రఘు రాములు, మనోహరరెడ్డి, అక్బర్ బాషా పాల్గొన్నారు.



విద్యార్థులతో చర్చిస్తున్న ప్రొఫెసర్

మూడు నెలలకే బీటలు

కురుగుంట వైఎస్ఆర్ కాలనీ సీసీ రోడ్డు నాణ్యత డొల్ల

అనంతపురంరూరల్, మార్చి 28: మండలంలోని కురుగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీలో మూడు నెలల క్రితం సీసీ రోడ్డు వేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించకపో వడంతో ఆ రోడ్డుపై సిమెంట్ పోయి కంకర తేలింది. ఆ పంచాయితీలో వేసింది ఆ ఒక్క రోడ్డే. అది ఇలా నాణ్యత లేకుండా వేశారు. గత ప్రభుత్వ హయంలో కాలనీ ప్రారంభమైయ్యే దగ్గర నుంచి దాదాపు 1600 మీటర్లు రెండు లైన్ల బీటీ రోడ్డు నిర్మాణానికి జీఓ విడుదలైంది. అయితే అప్పట్లో ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా ఆ రోడ్డు నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొంత మేర రోడ్డు వేశారు. మొత్తం ఒకటిన్నర కిలో మీటరు పైగా రోడ్డు ఉండగా 600 మీటర్లు సింగిల్ సీసీ రోడ్డును వేశారు. ఇందుకు దాదాపు రూ.40 లక్షలు ఖర్చు చేసినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ రోడ్డు నిర్మాణంలోనూ నాణ్యతా ప్రమాణాలను పాటించలేదు. దీంతో వేసిన మూడు నెలలకే రోడ్డుపై సిమెంట్ పోయి.. కంకర తేలింది.




కంకర తేలిన సీసీ రోడ్డు, బీటలు పడిన దృశ్యం (ఇన్‌సెట్లో)

ముగిసిన జాతీయ సదస్సు

అనంతపురం సెంట్రల్, మార్చి 28 : నగదు రహిత డిజిటల్ పేమెంట్ ప్లాట్ ఫామ్‌ల వినియోగం అనే అంశంపై ఎస్కేయూలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు గురువారంతో ముగిసింది. ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మయ్య మాట్లాడుతూ... డిజిటల్ పేమెంట్‌లో ప్రపంచ దేశాలతో పోటీపడాలని పేర్కొన్నారు. నేటి సాంకేతిక యుగంలో నగదు రహిత లావాదేవీలకు అనేక డిజిటల్ పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగంలో జపాన్, చైనా, అమెరికా దేశాలకన్నా భారత దేశం ముందంజలో ఉండాలన్నారు. తద్వారా నగదు రహిత ఆర్థిక వ్యవస్థ బలోపేతమై అన్నిరంగాల్లో ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెరిగి అభివృద్ధి సులభతరం అవుతుందన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఆంజనేయులు, జీవీ రమణ, మురళీకృష్ణ, ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రిజిస్ట్రార్ లక్ష్మయ్య

దుర్గంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవాలి

● అమిలినేనికి సూచించిన చంద్రబాబు


చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 28: కళ్యాణదుర్గం టీడీపీ కంచుకోటలో అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేయాలని అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబుకు సూచించారు. గురువారం అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో పర్యటనకు విచ్చేసిన చంద్రబాబును అమిలినేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చౌళం మల్లికార్జున కలిశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ విజయాన్ని సాధించబోతోందని, ఏ మండలంలో ఎంత మెజార్టీ వస్తుందన్న విషయాన్ని వారు క్షుణ్ణంగా చంద్రబాబుకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళుతున్నామని, ఆ దిశగా విజయాన్ని సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో చంద్రబాబు పాలన కోరుకుంటున్నారని, ఈసారి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని వివరించారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని ప్రజలకు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. ఏ గ్రామంలో చూసినా ప్రతి ఒక్కరు టీడీపీ పాలనవైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు.

అందరి ధ్యేయం అమిలినేని గెలుపు


మహిళకు నమస్కరిస్తున్న అమిలినేని యశ్వంత్

కళ్యాణదుర్గం, మార్చి 28: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు గెలుపే ధ్యేయంగా శాయశక్తులా కృషి చేయాలని ఆయన భార్య రమాదేవి, తనయుడు యశ్వంత్ చౌదరి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీ, పాత బస్టాండు, ఒంటిమిద్దె, దేవాదుల కొండ, కురాకులతోట గ్రామాల్లో వారు ప్రచారం చేపట్టారు. టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా ప్రతి ఇంటికి తాగునీరు రావాలన్నా టీడీపీతోనే సాధ్యమన్నారు. మున్సిపాలిటీలో మౌలిక వసతులు అధ్వానస్థితికి చేరుకున్నాయని, పార్టీ అధికారంలోకి వస్తే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అవకాశం వుంటుందన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా టీడీపీకి ప్రజలు మద్దతు ఇస్తామని బాహటంగా చెబుతున్నారని, ఈ సారి అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేస్తామన్నారు. జనసేన నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాగళానికి తరలిన తెలుగు తమ్ముళ్లు


సభకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కార్యకర్తలు

యల్లనూరు, మార్చి 28: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజర య్యే ప్రజాగళం సభకు గురువారం మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. 25వాహనాల్లో నాయకులు రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, చల్లా చంద్రశేఖర్‌నాయుడు, కొత్తపల్లి శరత్‌కుమార్, వీరభూషణ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.

పుట్లూరు: బుక్కరాయసముద్రం మండలకేంద్రంలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభకు గురువారం మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. 40వాహనాల్లో ఆయా గ్రామాల నుంచి భారీఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, భాస్కర్‌నాయుడు, రవిచంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు, జయుడు, రాజేష్, రామానాయుడు, రాము, శ్రీనివాసులురెడ్డి, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, వేణు, రామాంజి ఉన్నారు.


తరలివెళుతున్న టీడీపీ నాయకులు

విజిలెన్స్ అధికారుల తనిఖీ

యాడికి, మార్చి 28: రాయలచెరువులోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. రికార్డులు సరిగా లేని రూ.1.50లక్షల విలువైన ఎరువులను సీజ్‌చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, విజిలెన్స్ ఎస్‌ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి తెలిపిన వివరాలమేరకు రాయలచెరువులోని శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ దుకాణంలో తనిఖీలు చేశామన్నారు. ఎరువులు, పురుగుల మందుల నిల్వలు, రికార్డులు పరిశీలించినట్లు తెలిపారు. మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేశారు. ఏఓ మాట్లాడుతూ విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని, ఇవ్వని పక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. విజిలెన్స్ అధికారి వాసుప్రకాష్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు పోలీసులకు అప్పగింత

పెద్దవడుగూరు, మార్చి 28: మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని గ్రామస్థులు ఆరాతీయగా డోన్‌కు చెందిన వారమని పొంతన లేకుండా సమాధానాలు చెబుతుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. విచారించిన ఎస్‌ఐ శ్రీనివాసులు వీరిని క్రైమ్‌బ్రాంచ్‌కు అప్పగించారు.

అక్రమ మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 28: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కళ్యాణదుర్గం సెబ్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. 288 టెట్రా ప్యాకెట్లను బ్రహ్మసముద్రం మండలం ఎరడికెర గ్రామం వద్ద బెళుగుప్ప మండలం శ్రీరంగాపురం గ్రామం వద్ద మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో సెబ్ డీటీఎఫ్ సీఐ వెంకట లక్ష్మీ, ఎస్‌ఐ భాస్కర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

రాయదుర్గంరూరల్, మార్చి 28: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, రంగచేడు హగరి ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా సెబ్ అధికారులు డిగ్రీ కాలేజీ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధించి వదిలేసినట్లు తెలిపారు. రంగచేడు గ్రామానికి చెందిన వెంకటేశులు, భూపసముద్రం గ్రామానికి చెందిన మల్లేశప్పలుగా గుర్తించినట్లు తెలిపారు.

మహిళపై దాడి

పుట్లూరు, మార్చి 28: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీలో గురువారం నాగలక్షుమ్మ అనే మహిళపై నడిపి ఓబులేసు దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద కొళాయి విషయంలో మాటమాట పెరగడంతో నాగలక్షుమ్మను రాయితో కొట్టడంతో గాయపడింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

బొమ్మనహాళ్, మార్చి 28: మండలంలోని కళ్లహోళ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, దేవగిరి గ్రామానికి ఓ మహిళ వేరు వేరు సమయాల్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి బ ళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. కళ్లహోళ గ్రామానికి చెందిన గోవిందు(43) అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తిచెంది 6వ తేదీన గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య బెస్త ఈరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే దేవగిరి గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న(47) అనే మహిళ మానసిక ఆరోగ్యం బాగోలేక బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు హేమంత నాగ వెంకటసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఉరవకొండలో తాగునీటి సమస్య

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, మార్చి 28: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఉరవకొండలో ప్రజలకు తాగునీరు అందకుండా అయ్యే పరిస్థితి వచ్చిందని, ఇందుకు పాలకులే సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతపేటలో గురువారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో ప్రజాభిమానం వెల్లువెత్తుతోందన్నారు. టీడీపీని ఆశీర్వదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనపడుతున్నాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉరవకొండలో 10 నుంచి 15 రోజులకు ఒక్కసారి తాగునీటిని అందిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోనే నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, పైప్‌లైన్లు తప్ప, కొత్త కుళాయిలు ఏర్పాటు చేసినట్లు వైసీపీ నాయకులు భ్రమ కల్పిస్తున్నారన్నారు. ఒక్క నీటి చుక్క అయినా అదనంగా తీసువచ్చారా అని ప్రశ్నించారు. నీటి సమస్యపైన జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం లేదన్నారు. ఉరవకొండ తాగునీటికి కేటాయించిన నిధులు ఇతర నియోజకవర్గాలకు వాడుకుంటున్నారే తప్ప నీటి సమస్యపైన శ్రద్ధ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.10 ఇచ్చి, రూ.100 దోపిడీ చేస్తోందన్నారు. వైసీపీని గద్దె దింపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు పురుషోత్తం, నాగరాజు, నాయకులు తిమ్మప్ప, ప్యారం కేశవానంద, గోవిందు, రెడ్డి మాసి రవీంద్ర, జియో శ్రీన, రమేష్ పాల్గొన్నారు.

50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని సురేంద్ర బాబు

కళ్యాణదుర్గం, మార్చి 28: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో భారీఎత్తున పార్టీలోకి చేరుతున్నారు. వైసీపీ యువ నాయకుడు యాదవ సామాజికవర్గం నేత బాలా సోమశేఖర్ యాదవ్, 18వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మీ వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసి అమిలినేని సురేంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. మనందరి ధ్యేయం అమిలినేని గెలుపునకు కృషి చేయాలన్నారు. కళ్యాణ దుర్గం నియోజకవర్గంలో రోజురోజుకు వలసలు ఊపందుకున్నాయన్నారు. ఒకేసారి 50 వైసీపీ కుటుంబాలు చేరడంతో ఆ పార్టీకి కంటి మీద కునుకులేకుండా పోయింది. కళ్యాణదుర్గంలో గెలిచేది టీడీపీనేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్‌చౌదరి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన 13 వైసీపీ కుటుంబాలు గురువారం పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైసీపీ నాయకులు నరేష్ నాయక్, గోవిందనాయక్, అశోక్ నాయక్, మంజునాయక్, భాస్కర్ నాయక్‌తో పాటు బెళుగుప్పకు చెందిన కుమ్మరి రామాంజనేయులకు పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

వైసీపీ హయాంలో రైతులకు అన్యాయం


ఉంతకల్లులో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న నాయకులు


తాడిపత్రి: పల్లెవాండ్ల పల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 28: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని రాయదుర్గం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చంద్రహాస్, టీడీపీ నాయకుడు సప్తగిరి సత్యనారాయణ విమర్శించారు. గురువారం మండలంలోని ఉంతకల్లులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను వారు ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరుగుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కాలవ శ్రీనివాసులును గెలిపించాలని విన్నవించారు. జనసేన మండల కన్వీనర్ శివరాజ్, సికిందర్, టీడీపీ నాయకులు మల్లన్న, దిలీప్, ప్రేమ్‌కుమార్, ఖాసీం పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు రాహుల్ అన్నారు. గురువారం మండలంలోని గుడిపల్లి, గుడిపల్లి గొల్లలదొడ్డి గ్రామాల్లో మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో రాహుల్ నాయకులతో కలిసి ఇంటింటికి ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, కళ్యాణదుర్గం నియోజకవర్గ, గ్రామాల అభివృద్ధి కోసం టీడీపీ అభ్యర్థి అమిలినేనికి ఓటు వేసి ఆదరించాలని కోరారు.

తాడిపత్రిటౌన్,: పట్టణంలోని వడ్లపాలెంలో గురువారం బలిజసంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రసాద్, చల్లా రఘు, చల్లా రాంనాథ్, రంగనాయకులు, గండికోట కార్తీక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని హనిమిరెడ్డిపల్లి, కోనంపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు విక్రమ్‌సింహ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టోపై ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకులు ఆయనకు హారతులిస్తూ ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న పయ్యావుల కేశవను గెలిపించాలని అభ్యర్థించారు.


గుడిపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న రాహుల్


బెళుగుప్పలో విక్రమసింహ ప్రచారం

రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనండి

బెళుగుప్ప, మార్చి 28: రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి వైసీపీ కోసం పనిచేయాలని బెళుగుప్ప వలంటీర్లపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. నియోజకవర్గంలో వలంటీర్ల పై అధికారి (ఎంఎల్‌వో)తో పాటు వైసీపీ నాయకుడు రాజకీయాల్లో జోక్యం చేసుకుని ఈ తతంగం నడిపినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపీనేనని తరువాత మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తామని ప్రస్తుతం ప్రజలలోకి వెళ్లి పార్టీకోసం పనిచేయాలని కోరగా, తాము రాజీనామా చేయమని, వైసీపీకి ఓటేయించాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

డ్రగ్స్ ఏపీగా మార్చిన వైసీపీ ప్రభుత్వం

గుంతకల్లుటౌన్, మార్చి 28: అన్నపూర్ణగా పేరుగాంచిన ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ ప్రభుత్వం డ్రగ్స్ ఆంధ్రగా మార్చిందని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లింగరాజు యాదవ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కర్నూలు మెడికల్ కళాశాల, ఒంగోలు రిమ్స్ కళాశాలలో మెడికోలు గంజాయి సేవించి పట్టపగలే దాడులు చేసుకునే పరిస్థితి రావడానికి వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమిని ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● ఆటోబోల్తా పడి ఒకరు... ఐషర్ ఢీకొని మరొకరు

గుమ్మఘట్ట, మార్చి 28: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. గుమ్మఘట్ట మండలంలోని కె.ఎస్. దొడ్డి గ్రామం వద్ద ఆటో బోల్తా పడి గురువారం ఉదయం రక్షిత(17) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందగా మైలారి, రాజు గాయపడ్డారు. వీరిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గొల్లపల్లి గ్రామం నుంచి 74 ఉడేగోళం వద్ద ఉన్న అపెరల్ గార్మెంట్స్‌లో కార్మికురాలిగా పనిచేస్తున్న రక్షిత ప్రతి రోజూ ఆటోలో వెళుతుండేది. గురువారం ఇంటి నుంచి నలుగురు తోటి కార్మికులతో కలిసి వెళ్లిందా. డ్రైవర్ ఆటోను వేగంగా తీసుకెళ్లడంతో కేఎస్ దొడ్డి మలుపు వద్ద ఆటో బోల్తా పడి రక్షిత అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన ఇద్దరిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. తిప్పేస్వామి, సాకమ్మలకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రమాద విషయం తెలియగానే కుటుంబసభ్యులు, బం ధువులు ఘటనాస్థలానికి చేరుకుని బోరున విలపించారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కరిడికొండ వద్ద మహిళ..


మృతి చెందిన ఆదిలక్ష్మి

గుత్తిరూరల్: మండలంలోని కరిడికొండ గ్రామాశివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలక్ష్మి(50) అనే మహిళ మృతి చెందాగా మరొకరు గాయపడ్డారు. పెద్దవడుగూరుకు చెందిన బాబు, ఆదిలక్ష్మి దంపతులు ద్విచక్రవాహనంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం కట్టారికొండకు పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా కరిడికొండ గ్రామాశివారులోకి రాగానే వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీ కొట్టడంతో ఆమె అక్కడికి అక్కడే మృతి చెందింది. భర్త బాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న సీఐ వెంకటరామిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గుండ్లకొండలో హతమార్చి... పామిడిలో పడేశారు..!

● ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

● తల్లి, కుమారుడు, ప్రియుడే నిందితులు

● నెలన్నర తర్వాత వెలుగు చూసిన హత్య

పామిడి, మార్చి 28: కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న(55)ను కుటుంబ సభ్యులే హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. లక్ష్మన్నను గుండ్లకొండలో హతమార్చి పామిడి పెన్నానది ఒడ్డున పడేశారు. ఈ విషయం 41రోజుల తర్వాత గురువారం వెలుగులోకి వచ్చింది. దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... గుండ్లకొండ గ్రామానికి చెందిన పల్లె లక్ష్మన్న, పద్మావతి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. లక్ష్మన్నకు కుమారుడు, కుమార్తె సంతానం. పద్మావతిది పత్తికొండ మండలం చక్రాల గ్రామం. భార్యాభర్తలు తరచూ గొడవపడేవారన్నారు. అలిగి పద్మావతి పుట్టింటికి వెళ్లేదన్నారు. చక్రాల గ్రామానికి చెందిన బోయ మల్లయ్యతో పద్మావతికి వివాహేతర సంబంధం ఏర్పడిందన్నారు. లక్ష్మన్న భార్యపై అనుమానం పెంచుకొని మద్యానికి బానిసై వేధించేవాడన్నారు. ఎలాగైనా భర్తను హతమార్చాలని కుమారుడు వెంకటేష్, ప్రియుడు మల్లయ్యతో పథకం వేసిందన్నారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 16న రాత్రి చిత్రాన్నంలో నిద్రమాత్రలు కలిపిందన్నారు. అది తిన్న లక్ష్మన్న మత్తులోకి వెళ్లగా పథకం ప్రకారం కుమారుడు, ప్రియుడితో కలిసి ఉరి వేసిందన్నారు. చనిపోయిన తర్వాత కారులో మృతదేహాన్ని తీసుకువచ్చి పామిడి పెన్నానది ఒడ్డున కంపచెట్లలో పారేశారన్నారు. అనంతరం నెలరోజులకు తండ్రి కనిపించడం లేదని కుమారుడు పల్లె వెంకటేష్ దేవనకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు భార్య, కుమారుడిని తమదైన శైలిలో విచారించగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. విషయం తెలుసుకున్న సీఐ సిబ్బందితో పామిడి పెన్నానది ఒడ్డున ఉన్న మామిడితోట సరిహద్దులో వెతకగా అప్పటికే శరీరం కుళ్లిపోయింది. ఆ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేశారు. హత్యకు పాల్పడిన భార్య పద్మావతి, కుమారుడు వెంకటేష్, మల్లయ్యలను అరెస్టు చేశామన్నారు. కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.


పల్లె లక్ష్మన్న(ఫైల్)

మాజీ ఎంపీ జేసీ సుడిగాలి పర్యటన


వరదాయపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న జేసీ దివాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు, మార్చి 28: మండలంలో గురువారం టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, చిక్కేపల్లి గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఆయన వెంట జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, నారాయణస్వామి, చిన్న, అమరసింహ, అదెన్న, హుస్సేన్‌పీరా, మండల తెలుగు రైతు అధ్యక్షుడు కిరణ్, నరసింహారెడ్డి, వెంకటశివారెడ్డి, జనసేన నాయకులు మహేష్, బాబు ఉన్నారు.

టీడీపీ అధినేతను కలిసిన అశ్మిత్‌రెడ్డి


చంద్రబాబుతో జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 28: జిల్లా పర్యటనకు వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి కలిశారు. చంద్రబాబుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం తాడిపత్రి రాజకీయాల గురించి కాసేపు చర్చించారు.

నెట్టికంటి హుండీ ఆదాయం రూ. 13.57 లక్షలు

గుంతకల్లు, మార్చి28: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి ప్రధాన హుండీల ద్వారా రూ.13.57 ఆదాయం లభించింది. గురువారం ఉదయం దేవదాయ శాఖ అధికారులు ఆలయంలో వివిధ హుండీలను తెరచి భక్తులు వేసిన విరాళాలను లెక్కించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.13,57,847, అన్నదానం హుండీ ద్వారా రూ.20,850, 8-500 మిల్లీగ్రాముల బంగారం, 320 గ్రాముల వెండి వచ్చినట్లు అధికారులు తెలిపారు. మార్చి 6 నుంచి 28వ తేదీ ఉదయం వరకు హుండీల్లో భక్తులు వేసిన విరాళాల మొత్తమిదని వివరించారు. ఏఈఓ మల్లికార్జున, పీ వెంకటేశులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది, ఆర్డీసీ సేవా సమితి వలంటీర్లు పాల్గొన్నారు.

వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యల్లనూరు, మార్చి28: మండలకేంద్రంలోని శ్రీలక్ష్మి వెంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పదిరోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

నెట్టికంటి సన్నిధిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్


స్వామివారిని దర్శించుకుంటున్న చైర్మన్

గుంతకల్లు, మార్చి28: రాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ గంగారావు గురువారం ఉదయం కసాపురంలో పూజలు చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈఓ భద్రాజీ, ఏఈఓ మల్లికార్జున, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది ఏర్పాట్లపై సమీక్ష

గుంతకల్లు, మార్చి 28: ఉగాది పండుగను పురస్కరించుకుని కసాపురం దేవస్థానంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం ఈఓ వై భద్రాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని మూడు రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తామని, రథోత్సవం సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఆర్డీవో శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గుంతకల్లు మునిసిపాలిటీ, కసాపురం పంచాయతీ, పోలీసు, ఆలయ సిబ్బంది, వైద్య శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ సిబ్బంది ఉత్సవాల ఏర్పాట్ల విషయంగా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయ ఏఈఓ మల్లికార్జున, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ సుగుణమ్మ, తహసీల్దారు శేషఫణి, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

కూడేరు, మార్చి 28: త్వరలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అధికారులందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గర్గ్ సూచించారు. గురువారం కూడేరు తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తదితర అంశాలపై వివరించారు. అనంతరం ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును తనిఖీ చేసి సంబంధిత సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'కార్యకర్తలను కాపాడుకునే శక్తి మెట్టుకు లేదు'

రాయదుర్గంరూరల్, మార్చి 28: కార్యకర్తలను కాపాడుకునే శక్తి మెట్టు గోవిందరెడ్డికి లేదని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాల పాటు పదవిని అనుభవించినప్పటికీ కార్యకర్తలను కాపడుకోలేని మెట్టు ప్రస్తుతం వారిని ఎలా కాపాడుకోగలడో ఒకసారి ఆలోచించాలన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు చనిపోయినా తిరిగి చూడలేదన్నారు. కార్యకర్తలకు మంచి జరుగకపోయినా చెడు జరుగకూడదనే తన మనస్తత్వమని అన్నారు. ఎవరికి ఎలాంటి సహాయం కావాలన్నా నా దగ్గరకు రావాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

యల్లనూరు, మార్చి 28: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన ప్రజాగళం సభకు వెళుతూ కూచివారిపల్లికి చెందిన చిన్ననారాయణ (50) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎమెస్ రాజు ఆయన కుటుంబానికి రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. పార్టీ అండదండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

టీడీపీ నాయకుడు పెద్దయ్య మృతి

గుత్తిరూరల్,మార్చి 28: మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వడ్డే పెద్దయ్య(45) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే కుమారుడు ధర్మతేజ గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించాడు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గుమ్మనూరు సోదరులు కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు. రవితేజ నారాయణ స్వామి, వల్లా సాంబశివయ్య, బాలయ్య, రమణ, రామాంజి, శేఖర్ పాల్గొన్నారు.

కేశవ్ పిళ్లైకు ఘన నివాళి

గుత్తి, మార్చి 28: పట్టణంలోని కోట వీధిలోని కేశవ్ పిళ్లై ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర సమరయోధుడు పట్టు కేశవ్‌పిళ్లై వర్ధంతిని గురువారం ప్రా ధానోపాధ్యాయుడు సుభాన్ అధ్యక్షతన నిర్వహించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు దేశాయ్ నా గరాజు, జలజాక్షి, భార్గవి, కరీం, రమేష్‌బాబు, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 28: అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అధికారులకు ఆదేశించారు. గురువారం పట్టణంలోని సెబ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నాటు సారా తదితర వాటిపై నిరంతరం నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు.